తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు

ఎంపీపీ చెన్నుబోయిన శ్రీనివాసరావు


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ శ్రీనివాసరావు

తెనాలిటౌన్: వేసవి సీజన్ ప్రారంభం కానున్న నేపథ్యంలో ప్రజలకు తాగునీటి ఎద్దడి లేకుండా చూడాలని మండల పరిషత్ అధ్యక్షులు చెన్నుబోయిన శ్రీనివాసరావు అధికారులకు సూచించారు. కొత్తపేటలోని మండల పరిషత్ కార్యాలయంలో ఆదివారం సాధారణ సర్వసభ్య సమావేశం ఎంపీపీ అధ్యక్షతన జరిగింది. సమావేశంలో ఎంపీపీ శ్రీనివాసరావు మాట్లాడుతూ మొక్కజొన్న, జొన్న రైతులకు యూరియా సకాలంలో అందించాలని వ్యవసాయాధికారులను కోరారు. గ్రామాల్లో చేసిన వివిధ అభివృద్ధి పనులకు బిల్లులు మంజూరు కావడం లేదని సర్పంచ్‌లు షేక్ బాషా, బండికళ్ళ ప్రసాద్ తెలిపారు. కోపల్లె–కటెవరం రోడ్డు అధ్వానంగా ఉందని, కనీసం మరమ్మతులైనా చేపట్టాలని ఎంపీటీసీ సభ్యులు కిషోర్‌బాబు కోరారు.

కొలకలూరులో నిధుల వినియోగం గురించి వివాదం

కొలకలూరులో డయేరియా ప్రబలిన నేపథ్యంలో మంజూరైన నిధుల్లో గోల్‌మాల్ జరిగిందని ఎంపీటీసీ–2 సభ్యులు కాలిశెట్టి ఫణికుమార్ ఆరోపించారు. దీనిపై కొలకలూరు సర్పంచ్ చొప్పర ప్రీతి మాట్లాడుతూ అసలు నిధులు మంజూరు కాలేదని, నిధుల గోల్‌మాల్‌పై విచారణ చేసుకోవచ్చని పేర్కొన్నారు. తమ సొంత నిధులతో పనులు చేశామని వివరించారు. దీనిపై పంచాయతీ కార్యదర్శి విద్యాసాగర్ వివరణ ఇవ్వడంతో వివాదం సద్దుమణిగింది.

ఎంపీటీసీ రాజీనామా పత్రం!

తన పరిధిలో మార్చినెల మొదటి వారంలోగా అభివృద్ధి పనులు చేపట్టకపోతే తన రాజీనామాను ఆమోదించాలని ఎంపీటీసీ ఫణికుమార్ రాజీనామా పత్రాన్ని ఎంపీపీ శ్రీనివాసరావుకు అందజేశారు. అభివృద్ధి పనులకు మండల పరిషత్ నుంచి నిధులు విడుదల చేస్తున్నామని, గ్రామాల్లో పనులు ప్రారంభించాలని ఎంపీడీఓ విజయాలక్ష్మిణ్ తెలిపారు. మండల పరిషత్ సమావేశానికి అధికారులు హాజరు కావడం లేదని, హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు కోరారు. దీనిపై ఎంపీపీ మాట్లాడుతూ సమావేశానికి హాజరు కాని అధికారులకు నోటీసులు పంపుతామని తెలిపారు. సమావేశంలో జెడ్పీటీసీ సభ్యురాలు పిల్లి ఉమాప్రణతి, వైస్ ఎంపీపీ కోడూరు స్వప్న, ఎంపీటీసీ చెన్నకేశవులు, పీఆర్ ఏఈ వెంకటేశ్వరరావు, కార్యాలయ ఏఓ ప్రతాపరెడ్డి, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

వైభవంగా ఆంజనేయుని రథోత్సవం


రథోత్సవంలో స్వామి ఊరేగింపు

తెనాలిటౌన్: షరాఫ్ బజార్‌లోని సువర్చలా సమేత పంచముఖ ఆంజనేయస్వామి దేవస్థానంలో వార్షిక బ్రహ్మోత్సవాలు కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఐదో రోజున ఆదివారం స్వామి రథోత్సవాన్ని నిర్వహించారు. ఆలయ వంశపారంపర్య అర్చకులు రొంపిచర్ల శ్రీనివాసమూర్తి ఆధ్వర్యంలో యాజ్ఞికులు రఘురామ్, నాగమారుతీ వైదిక క్రతవును ఆగమయుక్తంగా నిర్వహించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి అవుతు శ్రీనివాసరెడ్డి, ఎస్‌బీ శివ కార్యక్రమాలను పర్యవేక్షించారు. పంచముఖ ఆంజనేయస్వామి సంకీర్తన బృందం, సంకీర్తన సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.


స్వామి సన్నిధిలో పూజలు చేస్తున్న అర్చకులు

క్లుప్తంగా

'స్వాతంత్ర్య యోధుడు కృష్ణమూర్తి జీవితచరిత్ర' ఆవిష్కరణ

కటెవరం(తెనాలి): తెనాలి రూరల్ మండలం కటెవరం గ్రామానికి చెందిన లక్కరాజు లీలా వేణుగోపాలకృష్ణమూర్తి సంక్షిప్త జీవితచరిత్ర పుస్తకాన్ని ఆదివారం ఆవిష్కరించారు. ఏవీఆర్‌ఎం క్లబ్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో కృష్ణమూర్తి సేవలను స్మరించుకున్నారు. కటెవరంలో జన్మించిన కృష్ణమూర్తి స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొన్నారు. స్వయంగా అథ్లెట్ అయిన కృష్ణమూర్తి, ఎల్‌వీఆర్ అథ్లెటిక్ క్లబ్‌ను స్థాపించి రెండు దశాబ్దాలపాటు పలువురు క్రీడాకారులను జాతీయ అంతర్జాతీయ స్థాయికి తీర్చిదిద్దినట్టు తెలిపారు. దాదాపు అందరికీ క్రీడాకోటాలో ఉద్యోగాలు వచ్చేలా చూశారని తెలిపారు. ఆయన స్ఫూర్తిగా ఏవీఆర్‌ఎం క్లబ్ వెయిట్‌లిఫ్టింగ్‌లో శిక్షణనిస్తూ ఇప్పటికే పలు విజయాలు సాధిస్తుండటం అభినందనీయమని వక్తలు చెప్పారు. హెచ్ఆర్ లక్కరాజు, ఎల్.కిషోర్‌కుమార్, కడియాల వెంకటేశ్వర్లు, ఎల్‌కే రామారావు, వేమూరి విజయభాస్కర్, ఎల్.ఉమానాథ్, పోతావఝుల పురుషోత్తమశర్మ, ఎ.వెంకటరెడ్డి, వలి, సాయి తదితరులు పాల్గొన్నారు.

లిక్విడ్ గంజాయి కేసులో పాత నేరస్తుడి అరెస్టు


నిందితుడు మస్తాన్‌వలితో సీఐ రమేష్, సిబ్బంది


నగరంపాలెం: లిక్విడ్ గంజాయి కేసులో మరొకరిని అరెస్టు చేసినట్లు ఎస్ఈబీ గుంటూరు–2 స్టేషన్ సీఐ ఎం.రమేష్ ఆదివారం తెలిపారు. ఈనెల 1న ఎస్ఈబీ గుంటూరు–2, డీఎస్ఈటీ బృంద పోలీసులు గుంటూరు క్లబ్ వద్ద వాహన తనిఖీలు చేశారు. ఈ క్రమంలో బైక్‌పై వెళ్తున్న ఇద్దరిలో ఒకరిని అరెస్టు చేసి, రూ.1.40 లక్షల లిక్విడ్ గంజాయితో పాటు మోటారు సైకిల్‌ను సీజ్ చేశారు. పరారైన మారుతీనగర్‌కు చెందిన తాజుద్దీన్‌తోపాటు అదే ప్రాంతానికి చెందిన శివప్రసాద్‌ను అరెస్టు చేశారు. ఇదే కేసులో మరో కీలకమైన నేతాజీనగర్ ఎనిమిదో వీధికి చెందిన షేక్ మస్తాన్‌వలి అలియాస్ బుడ్డాయ్‌ని అరెస్టు చేసినట్లు సీఐ చెప్పారు. అతని నుంచి అరవై గ్రాముల లిక్విడ్ గంజాయి డబ్బాలు ఐదింటిని స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. నర్సీపట్నం లోతుగట్టు జంక్షన్ వద్దకెళ్లి గంజాయి తీసుకొచ్చి తాగుతూ, విక్రయించేవాడని దర్యాప్తులో వెల్లడైందని తెలిపారు. పెయింటింగ్ పనులకు వెళ్లే అతనిపై పట్టాభిపురం పీఎస్‌లో రెండు కేసులు నమోదైనట్లు ఆయన చెప్పారు.

భక్తిప్రపత్తులతో సత్యదేవుని నగరోత్సవం


నగరోత్సవంలో పాల్గొన్న భక్తులు

పాత గుంటూరు: పట్టాభిపురంలోని శ్రీ రామ సత్యనారాయణస్వామి దేవస్థానం 46వ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం విశేష పూజలు, హోమాలు నిర్వహించారు. సహస్ర దీపాలంకరణ సేవ, ఉంజల్ సేవలో భక్తులు విశేష సంఖ్యలో పాల్గొన్నారు. ఉదయం సువర్చలా ఆంజనేయస్వామి శాంతి కల్యాణాన్ని వేద పండితులు భక్తిశ్రద్ధలతో జరిపారు. సాయంత్రం సత్యదేవుని నగర ఉత్సవం వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా హైకోర్టు న్యాయమూర్తి బొప్పూడి కృష్ణమోహన్ దంపతులు పాల్గొన్నారు. ప్రత్యేక పూజలు నిర్వహించి నగరోత్సవంలో పాల్గొన్నారు. కార్యక్రమాన్ని ఆలయ చైర్మన్ చావలి గణపతి, రావిపాటి సత్యనారాయణ, కామేశ్వరరావు తదితరులు పర్యవేక్షించారు.

వైభవంగా ఉరుసు మహోత్సవం



పాత గుంటూరు: ఆంధ్రా ముస్లిం కళాశాల సమీపంలోని శ్రీ హజరత్ మొహమ్మద్ ఖాసీం అలీషా ఖాదరీ దర్గా 101వ ఉరుసు మహోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ఆదివారం దీపారాధనను భక్తిశ్రద్ధలతో జరిపారు. మాషుక్ సాహెబ్ కోలార్ చమన్ ఖలీఫా, కోమల్‌పాడు మొహమ్మద్ తాజుద్దీన్ సాహెబ్ పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమాన్ని ధర్మకర్త జనాబ్ మొహమ్మద్ మహమూద్ సాహెబ్, పీఠాధిపతి హజరత్ మొహమ్మద్ మన్సూర్ అహ్మద్ అలీషా ఖాదరీ అల్ హసనీ వల్ హుసైనీ, ట్రస్ట్ సభ్యులు షేక్ మీరా మొహిద్దీన్, రోషన్ జమీర్, ఖాజా మొయినుద్దీన్, మీరా మొయినుద్దీన్, మహమ్మద్ జిలాని పర్యవేక్షించారు.

చిరస్మరణీయురాలు సుధాబాల


మాట్లాడుతున్న జనసాహితి సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు దివి కుమార్

తెనాలి: జనసాహితి సంస్థకు, ప్రజాసాహితి పత్రికకు అత్యంత ఆత్మీయురాలు కొత్తపల్లి సుధాబాల నేత్ర, శరీరదానంతో చిరస్మరణీయులయ్యారని పలువురు వక్తలు ఆమె సంస్మరణ సభలో నివాళులర్పించారు. ప్రజాసాహితి మాసపత్రిక ప్రధాన సంపాదకుడు, నగరం డిగ్రీ కాలేజి విశ్రాంత ప్రిన్సిపాల్ కొత్తపల్లి రవిబాబు సతీమణి కొత్తపల్లి అరుణ ఇటీవల మృతిచెందిన విషయం తెలిసిందే. కుటుంబ సభ్యులు అదేరోజు ఆమె నేత్రాలను గుంటూరులోని అగర్వాల్ కంటి ఆస్పత్రికి దానం చేశారు. వైద్యవిద్యార్థుల పరిశోధనల నిమిత్తం సుధాబాల శరీరాన్ని విజయవాడ దగ్గర్లోని నిమ్రా మెడికల్ కాలేజికి దానమిచ్చారు. స్థానిక ఈటీ కాలనీలోని నివాసం వద్ద ఆదివారం సుధాబాల సంస్మరణ సభను నిర్వహించారు. ఓపీడీఆర్ రాష్ట్ర కార్యదర్శి వి.హనుమంతరావు అధ్యక్షత వహించారు. జనసాహితి రాష్ట్ర అధ్యక్షుడు దివి కుమార్ మాట్లాడుతూ ఐదున్నర దశాబ్దాలుగా జనసాహితీ సంస్థకు, ప్రజాసాహితి మాసపత్రికకు సుధాబాల ఎంతో ఆత్మీయంగా ఉంటూ వచ్చినట్టు గుర్తుచేసుకున్నారు. ప్రధాన సంపాదకుడు కొత్తపల్లి రవిబాబు సహచరిగా కుటుంబ బాధ్యతలు చూసుకుంటూ, ప్రజాసాహితి కార్యక్రమాలకు ఆటంకం లేకుండా కాచుకున్నారని చెప్పారు. రవిబాబు స్వాతంత్ర్యోద్యమ కుటుంబం నుంచి వచ్చినందున, ఆ అభ్యుదయ భావాలను సుధాబాల పుణికిపుచ్చుకున్నారని అభిప్రాయపడ్డారు. మెడికల్ కాలేజికి శరీరాన్ని దానమిచ్చే సద్గుణం తెనాలి నుంచే మొదలైందని చెప్పారు. 1940వ దశకంలో తెనాలికే చెందిన డాక్టర్ ఉళ్లక్కి గుంటూరు మెడికల్ కాలేజికి తన శరీరాన్ని దానంగా ఇచ్చినట్టు గుర్తుచేశారు. ఆయన ఆదర్శంగా ఆ సంప్రదాయం ఇప్పటికీ అక్కడక్కడా కొనసాగటం గొప్ప విషయంగా చెప్పారు. సంప్రదాయాలకు ప్రాముఖ్యమిచ్చే వారిని సుధాబాల ఎప్పుడూ గౌరవించేవారని, తాను మాత్రం శాస్త్రీయత అవసరాన్ని నొక్కి చెప్పేవారని స్త్రీ విముక్తి సంఘటన రాష్ట్ర అధ్యక్షురాలు డాక్టర్ సి.విజయ చెప్పారు. కుటుంబ శ్రేయస్సుతోనే అభివృద్ధి కాదనీ, సమాజం అభివృద్ధి చెందటానికీ మనిషి దోహదపడాలన్న ఆలోచనతోనే ఆమె చివరివరకు కొనసాగారని చెప్పారు. వ్యక్తులుగా విడిపోతున్న నేటి సమాజంలో కుటుంబం ఉద్యమాలు ఎంత అవసరమో సుధాబాల నిరూపించారని పౌరహక్కుల సంఘం జిల్లా నేత రాజారావు అన్నారు. సమాజం సమసమాజంగా రూపుదాల్చటానికి సాంస్కృతిక సంస్కృతి అవసరాన్ని ముందుకు తీసుకెళ్లటంలో రవిబాబుకు పూర్తి సహకారం అందించారని బౌద్ధ ఉద్యమ ప్రముఖుడు బొర్రా గోవర్ధన్ అన్నారు. రైతుకూలీ సంఘం రాష్ట్ర కార్యవర్గసభ్యుడు బొల్లిముంత సాంబశివరావు, కొల్లి మురళి, అంకురం సినిమా దర్శకుడు సి.ఉమామహేశ్వరరావు, శ్రీశ్రీ ప్రింటర్స్ విశ్వేశ్వరరావు, ఎ.పాండురంగవరప్రసాద్, భార్గవశ్రీ, గోరంట్ల లోకేశ్, మండవ శోభారాణి, డాక్టర్ పిల్లి వాసు, డాక్టర్ భీమవరపు సాంబిరెడ్డి, సీహెచ్ నాగిరెడ్డి మాట్లాడారు. నందూరి నారాయణరావు, చందు నాగేశ్వరరావు పర్యవేక్షించారు.

లలిత మహాత్రిపుర సుందరి పుట్టిన రోజు వేడుకలు


శ్రీ విద్యాపీఠంలో పూజలు నిర్వహిస్తున్న బాలస్వామిజీ, భక్తులు

తెనాలిటౌన్: స్థానిక గంగానమ్మపేటలోని విద్యాపీఠంలో సాలిగ్రామ మఠం ఆధ్వర్యంలో లలిత మహా త్రిపుర సుందరి అమ్మవారి పుట్టిన రోజు వేడుకలు ఆదివారం జరిగాయి. పూజ్యశ్రీ బాలస్వామిజీ ఆధ్వర్యంలో మాఘ పూర్ణిమ సందర్భంగా అమ్మవారికి విశేష అభిషేకం ప్రత్యేక పూజలు, సామూహిక లలితా సహస్రనామ స్తోత్రం, పారాయణం, అష్టోత్తర, మహా మంగళ హారతి, మంత్రపుష్పం నిర్వహించారు.

దివ్యాంగులను ఆదరిద్దాం


దివ్యాంగ వృద్ధుడికి ట్రైసైకిల్ అందజేస్తున్న ముంతాజ్ బేగం

తాళ్ళాయపాలెం(తాడికొండ): అంగవైకల్యం ఉన్న వారిని చులకనగా చూడకుండా ఆదరించడం ద్వారా వారిలో ఆత్మస్థైర్యం పెంపొందించవచ్చని వికలాంగుల కార్పొరేషన్ చైర్‌పర్సన్ ముంతాజ్ బేగం చెప్పారు. ఆదివారం తుళ్ళూరు మండలం తాళ్ళాయపాలెంలో వైఎస్సార్ సీపీ నాయకులు ఐనవోలు సుధీర్ ఆధ్వర్యంలో అంగవైకల్యం ఉన్న వృద్ధుడికి ట్రైసైకిల్ పంపిణీ కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. వికలాంగులకు చేయూత అందించేందుకు యువత ముందుకు రావడం హర్షణీయమని కొనియాడారు.

కోడిపందేల శిబిరంపై దాడి

తెనాలిరూరల్: కోడి పందేల శిబిరంపై పోలీసులు దాడులు నిర్వహించారు. తెనాలి మండలం ఖాజీపేట డొంక రోడ్డులో కోడి పందేలు నిర్వహిస్తున్నారన్న సమాచారంతో రూరల్ ఎస్ఐ చిరుమామిళ్ల వెంకటేశ్వర్లు తమ సిబ్బందితో ఆదివారం ఆకస్మిక దాడులు నిర్వహించారు. ఏడుగురు పందెం రాయుళ్లను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి ఒక కోడి, రూ.3,350 నగదు స్వాధీనం చేసుకున్నారని వివరించారు.

బాలోత్సవం నమోదు గడువు పొడిగింపు

గుంటూరు ఎడ్యుకేషన్: గుంటూరులోని శ్రీపాటిబండ్ల సీతారామయ్య పాఠశాల వేదికగా ఈనెల 11, 12 తేదీల్లో నిర్వహిస్తున్న గుంటూరు జిల్లా బాలోత్సవం నమోదు గడువును పాఠశాలల యాజమాన్యాలు, తల్లిదండ్రుల విజ్ఞప్తి మేరకు పొడిగించినట్లు అధ్యక్షుడు, ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 23 అంశాల్లో నిర్వహిస్తున్న బాలోత్సవంలో 4,5,6,7 తరగతుల విద్యార్థులకు జూనియర్, 8,9,10 తరగతులకు సీనియర్ విభాగాల్లో నిర్వహించే పోటీలకు శనివారం ముగిసిన గడువును ఈనెల 10వ తేదీ వరకు పొడిగించినట్లు ఆయన పేర్కొన్నారు. వివరాలకు 97035 79996 నంబర్లో సంప్రదించాలని సూచించారు.

డాక్టర్ కాళీ ప్రసాద్ సేవలు మరువలేనివి


2కే వాక్‌ను ప్రారంభిస్తున్న శ్రీలీల, డాక్టర్ కోటనాగయ్య

తెనాలిటౌన్: డాక్టర్ కాళీ ప్రసాద్ వైద్యసేవలు మరువలేనివని జీఎస్టీ డెప్యూటీ కమిషనర్ యడ్ల శ్రీలీల(హైదరాబాద్), పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ జె.కోటినాగయ్య పేర్కొన్నారు. రూరల్ మండలం కొలకలూరు గ్రామానికి చెందిన డాక్టర్ యడ్ల కాళీప్రసాద్ ప్రథమ వర్ధంతి సందర్భంగా ఆదివారం గ్రామంలో 2కే వాక్‌ను నిర్వహించారు. వాక్‌ను డెప్యూటీ కమిషనర్ శ్రీలీల, డాక్టర్ కోటినాగయ్య, రీజనల్ ట్రాన్స్‌పోర్ట్ అధికారి యడ్ల శ్రీచందన ప్రారంభించారు. నడక పోటీలలో విజేతలకు బహుమతులను పాఠశాల ఆటస్థలంలో జరిగిన కార్యక్రమంలో అందజేశారు. సభలో శ్రీలీల మాట్లాడుతూ గ్రామాభివృద్ధికి ప్రణాళిక ప్రకారం తమవంతు కృషి చేస్తామన్నారు. మొక్కలు నాటే కార్యక్రమం చేపడతామన్నారు. పేదలకు వైద్యసేవలు అందించిన కాళీప్రసాద్ అభినందనీయులన్నారు. ట్రాన్స్‌పోర్ట్ అధికారి శ్రీచందన మాట్లాడుతూ ప్రజలందరూ ఆరోగ్యంగా ఉండాలని కాళీప్రసాద్ ఆకాంక్షించేవారని చెప్పారు. పోటీలకు ఆఫీషియల్స్‌గా ఫిజికల్ డైరెక్టర్ నాగయ్య, శిరీష, ఎస్.వినయ్‌కుమార్, అంబేడ్కర్, మోజెష్ వ్యవహరించారు. కార్యక్రమంలో న్యాయవాది సుద్దపల్లి మురళీధర్, యడ్లపల్లి రవికిరణ్, కోడవి సుదర్శన్, యడ్ల శ్రీధర్, కామేష్, తోట లక్ష్మయ్యలు పాల్గొన్నారు.

305 మందికి కంటి పరీక్షలు


కంటి వైద్యపరీక్షలు చేస్తున్న వైద్యులు

తెనాలి: స్థానిక సుల్తానాబాద్‌లోని శ్రీసరస్వతి శిశు మందిర్ ప్రాంగణంలో ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. పెదకాకానిలోని శంకర కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో తెనాలి ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లోని కుమార్ పంప్స్, సుబ్రం వాటర్ సంస్థల సహకారంతో ఈ వైద్యశిబిరం నిర్వహించారు. తెనాలి, పరిసర గ్రామాల నుంచి ప్రజలు పెద్ద ఎత్తున వైద్యశిబిరానికి విచ్చేశారు. క్యాంప్ ఇన్‌చార్జి బీవీ నాగబాబు పర్యవేక్షణలో డాక్టర్ స్పందన, డాక్టర్ విష్ణుప్రియ, డాక్టర్ దివ్యశంకర్ కంటి పరీక్షలు చేశారు. అవసరమైన వారికి కంటి శుక్లాల ఆపరేషన్లు చేయాలని చెప్పారు. మొత్తం 305 మందికి వైద్య పరీక్షలు చేశారు. వీరిలో 95 మందికి శుక్లాల ఆపరేషన్లు అవసరమని వైద్యులు నిర్ధారించారు. వీరందరినీ త్వరలోనే శంకర కంటి ఆస్పత్రికి తీసుకెళ్లి, ఉచితంగా ఆపరేషన్ చేయిస్తామని నిర్వాహకులు తెలియజేశారు. కుమార్ పంప్స్ బాధ్యులు కొత్త శ్రీనివాసకుమార్, కృష్ణకుమార్, హరికుమార్, శేషుకుమార్ పర్యవేక్షించారు.

జంపని కాల్వలో పూడిక తీత చేపట్టాలని వినతి


జంపని కాల్వను పరిశీలిస్తున్న శివకోటేశ్వరరావు, వెంకటేశ్వరరావు, తదితరులు

తెనాలిఅర్బన్: తెనాలి పట్టణంలోని జంపని కాల్వ పూడికతీత పనులను వెంటనే చేపట్టాలని తెనాలి పట్టణ, పరిసర ప్రాంత అభివృద్ధి సంఘం నాయకులు డిమాండ్ చేశారు. జంపని డ్రెయిన్‌ను ఆదివారం వారు పరిశీలించారు. వారు మాట్లాడుతూ డ్రెయిన్ పూడికతీత పనులు చేపట్టకపోవడం వల్ల పారుదల నిలిచిపోయిందని చెప్పారు. దీనివల్ల దోమల వ్యాప్తి పెరిగి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్, మున్సిపల్ అధికారులు వెంటనే స్పందించి పూడికతీత పనులు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో అధ్యక్షుడు దరిశి శివకోటేశ్వరరావు, కార్యదర్శి బొమ్మదేవర వెంకటేశ్వరరావు, నాయకులు రావూరి శంకరరావు, నారాయణం కమలకుమార్, వాకా పేరిరెడ్డి, మాచిరాజు కృష్ణమూర్తి, బిఎల్ రాజేంద్రప్రసాద్, అబ్దుల్ ఆరీఫ్, వై.చెంచయ్య, బాలకృష్ణనాయక్, శివరామయ్య తదితరులు పాల్గొన్నారు.

సెయింట్ జాన్స్ వార్షికోత్సవం


క్రికెట్‌లో గెలుపొందిన జట్టుకు బహుమతులు అందజేస్తున్న అతిథులు

తెనాలిరూరల్: పట్టణ నాజరుపేటలోని సెయింట్ జాన్స్ ఇంగ్లిష్ మీడియం స్కూల్ 51వ వార్షికోత్సవాన్ని శనివారం రాత్రి నిర్వహించారు. స్కూల్ డైరెక్టర్ కె.యాని అరుణలత సభకు అధ్యక్షత వహించి స్కూల్ వార్షిక నివేదికను వివరించారు. స్కూల్ చైర్మన్ డాక్టర్ జె.సూరజ్‌మోహన్ స్కూలు సాధించిన అభివృద్ధి, లక్ష్యాలను తెలియజేశారు. సెయింట్ జోసఫ్స్ కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్ ప్రిన్సిపల్ డాక్టర్ టి.స్వరూపరాణి, మౌలానా ఆజాద్ నేషనల్ ఉర్దూ యూనివర్శిటీ ప్రొఫెసర్ డాక్టర్ ఆడమ్‌పాల్ పట్టెటి, ఏఎల్ కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్ మాజీ ప్రిన్సిపల్ డాక్టర్ జె.ప్రశాంత్ కుమార్, పాఠశాల పూర్వ విద్యార్థిని డాక్టర్ సుధ నన్నపనేని ముఖ్య అతిథులుగా పాల్గొని విద్యార్థులకు పలు సూచనలు చేశారు. 2022–23 విద్యా సంవత్సరంలో పాఠశాలలో నిర్వహించిన స్పోర్ట్స్ మీట్, డ్యాన్స్, మ్యూజిక్, డిబేట్, క్విజ్ పోటీలలో విజేతలకు బహుమతులను అందజేశారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతికాంశాలు అలరించాయి.

తెలుగు ధిక్కార కవులు కలేకూరి, మద్దూరి, పైడి

ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ డొక్కా మాణిక్య వరప్రసాద్



ఆహ్వాన పత్రికను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ డొక్కా మాణిక్యవరప్రసాద్ తదితరులు

పాత గుంటూరు: తెలుగు సాహిత్యంలో ధిక్కార కవులుగా కలేకూరి ప్రసాద్, మద్దూరి నగేష్ బాబు, పైడి తెరేష్ బాబు చరిత్రలో నిలిచిపోయారని ఎమ్మెల్సీ డొక్కా మాణిక్య వరప్రసాద్ పేర్కొన్నారు. ఆదివారం బ్రాడీపేటలోని ఒక హోటల్‌లో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, జాషువా, పూలే, పెరియార్ లిటరేచర్ ఫౌండేషన్ అధ్యక్షుడు బి.విల్సన్ ఆధ్వర్యంలో కలేకూరి ప్రసాద్, మద్దూరి నగేష్ బాబు, పైడి తెరేష్ బాబు దళిత బహుజన తత్వం అంశంపై ఈనెల 11వ తేదీ సాయంత్రం 5 గంటలకు జరిగే కార్యక్రమం ఆహ్వాన పత్రికలు ఆవిష్కరించారు. ఎమ్మెల్సీ మాట్లాడుతూ కలేకూరి ప్రసాద్, మద్దూరి నగేష్ బాబు, పైడి తెరేష్‌బాబు దళిత అస్తిత్వాన్ని తెలుగు సాహిత్యంలో బలంగా వినిపించారని గుర్తు చేశారు. కార్యక్రమంలో విరసం నాయకులు సి.ఎస్.ఆర్.ప్రసాద్, కవులు ఎఫ్.ఎం.సుభాని, చంద్రపాల్, శ్యాం బాబు, కడియం జేమ్స్, బండారు సురేష్ బాబు, న్యాయవాది సంజీవరెడ్డి మార్పుల పాల్గొన్నారు.

పరీక్షలంటే భయాన్ని వీడాలి

విశ్రాంత ఐపీఎస్ అధికారి లక్ష్మీనారాయణ



కార్యక్రమంలో పాల్గొన్న లక్ష్మీనారాయణ, స్కూల్ డైరెక్టర్లు

పాత గుంటూరు: విద్యార్థులంతా పరీక్షలంటే భయాన్ని వీడాలని విశ్రాంత ఐపీఎస్ అధికారి వి.వి.లక్ష్మీనారాయణ సూచించారు. సమయాన్ని వృథా చేయకుండా పరీక్షల్లో వచ్చే ప్రశ్నలను ముందే గ్రహిస్తే సునాయాసంగా రాయవచ్చని తెలిపారు. ఆదివారం రాజాగారితోటలోని వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో ఏపీ ప్రైవేట్ స్కూల్ అసోసియేషన్, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ, జూనియర్ రెడ్‌క్రాస్ సంయుక్త ఆధ్వర్యంలో పరీక్షా పే చర్చా కార్యక్రమం నిర్వహించారు. సభకు రెడ్‌క్రాస్ యూత్ కో–ఆర్డినేటర్ ఎస్.వి.ఎస్.లక్ష్మీనారాయణ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా వి.వి.లక్ష్మీనారాయణ మాట్లాడుతూ సూర్యాస్తమయానికి ముందు భోజనం చేసి, సూర్యోదయానికి ముందు నిద్రలేస్తే విద్యార్థులు ఆరోగ్యవంతంగా ఉంటారని పేర్కొన్నారు. పరీక్షలు అయిపోయే వరకు సెల్‌ఫోన్లకు దూరంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ మాడుగుల నాగఫణిశర్మ, రెడ్‌క్రాస్ వైస్ చైర్మన్ పి.రామచంద్రరాజు, ప్రైవేట్ స్కూల్ అసోసియేషన్ రాష్ట్ర నేత మేకల రవీంద్రబాబు, జిల్లా అధ్యక్షుడు చెరుకూరి శ్రీహరి, నాయకులు వంగా శ్రీనివాసరావు, ఎ.సురేష్, మల్లికార్జునరావు, నర్రా రాజేష్, బత్తిన వెంకట్రావు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అలరించిన భక్తి సంగీత విభావరి



పాత గుంటూరు: బృందావన్ గార్డెన్స్ శ్రీ వెంకటేశ్వరస్వామి దేవస్థానంలోని అన్నమయ్య కళా వేదికపై శ్రీ సాయిరాగ సంగీత కళాశాల రెండో వార్షికోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా డాక్టర్ జాస్తి వీరాంజనేయులు, ఆలయ అధ్యక్షుడు సీహెచ్.మస్తానయ్య జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించారు. సంస్థ వ్యవస్థాపకురాలు మునిపల్లె రమణి ఆధ్వర్యంలో జరిగిన భక్తి సంగీత విభావరిలో గాయకులు అన్నమయ్య కీర్తనలు, భక్తి కీర్తనలు ఆలపించి ప్రేక్షకుల్ని అలరించారు. వీరికి కీబోర్డ్‌పై ఆదాం, సాయి, ప్యాడ్స్‌పై ఈశ్వర్, తబలాపై పి.వి.రమణ వాయిద్య సహకారం అందించారు.

హక్కుల కమిషన్ సభ్యుడు శ్రీనివాస్‌కు సన్మానం


శ్రీనివాస్‌ను సన్మానిస్తున్న ఏఎన్‌యూ లా విభాగ పూర్వ విద్యార్థులు

ఏఎన్‌యూ: రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ సభ్యుడు, ఆచార్య నాగార్జున యూనివర్సిటీ న్యాయశాస్త్ర విభాగ పూర్వ విద్యార్థి డాక్టర్ గోచిపాత శ్రీనివాస్‌ను లా విభాగ పూర్వ విద్యార్థులు ఘనంగా సన్మానించారు. యూనివర్సిటీలో ఆదివారం జరిగిన ఏఎన్‌యూ లా పూర్వ విద్యార్థుల సమావేశంలో పాల్గొన్న డాక్టర్ శ్రీనివాస్‌కు పూర్వ విద్యార్థులైన ఆయన మిత్రులు ఈ ఆత్మీయ సత్కారం చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ తమ సహచరుడు, లా విభాగ పూర్వ విద్యార్థి రాష్ట్రంలోనే ప్రతిష్ఠాత్మకమైన పదవిలో ఉండటం అభినందనీయమని తెలిపారు. యూనివర్సిటీ సమీపంలోని నంబూరు గ్రామానికి చెందిన శ్రీనివాస్ విద్యార్థి దశ నుంచే లక్ష్యాన్ని నిర్దేశించుకుని దాని సాధన కోసం కృషి చేశారని తెలిపారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ హైకోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్ నాగిరెడ్డి, లా విభాగ పూర్వ విద్యార్థులు, డాక్టర్ చందు పాల్గొన్నారు.

